క్లుప్తంగా

నాగుపాము ప్రత్యక్షం

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల అత్యంత పురాతనమైన గట్టు మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం నాగుపాము ప్రత్యక్షమైంది. పూజారులు ఆదివారం ఉదయం గుడిలో పూజలు చేసేందుకు గర్భాలయం తలుపులు తెరిచి శుభ్రపరిచి శివలింగానికి పూజలు చేస్తున్న క్రమంలో విగ్రహంపై నాగుపాము ప్రత్యక్షమైనట్లు ఆలయ పూజారులు తెలిపారు. గర్భాలయంలోకి నాగుపాము వచ్చిందని తెలిసి భక్తులు తరలివచ్చి వీక్షించారు. పూజల అనంతరం నాగుపాము అర్ధగంట పాటు విగ్రహంపై ఉండి బయటికి వెళ్లిపోయిందని పూజారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. దర్గా, హౌసింగ్ బోర్డు కాలనీ, బియాబానీ నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రంథాలయ దినోత్సవం

కేయూ క్యాంపస్: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం కేయూలోని కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్స్ డేను నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ వరంగల్ శాఖ, కేయూ కేంద్ర గ్రంథాలయం లైబ్రరీ సైన్స్ డిపార్టుమెంట్ సంయుక్తంగా నిర్వహించనున్న కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు రైల్వే డీజిల్‌షెడ్ ఎదుట ధర్నా

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ ఎదుట రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు బ్రాంచ్ ప్రెసిడెంట్ జానీమియా, సెక్రటరీ పి.వేదప్రకాష్ తెలిపారు. రైల్వే కార్మికులకు పాత పింఛన్ అమలు చేయాలని, 18 నెలల పెండింగ్ డీఏ ఎరియర్స్ చెల్లించాలని, 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, డీజిల్ షెడ్‌లో ఖాళీలను భర్తీ చేయాలని నిరసన తెలపనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలరాజుకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ విభాగం పరిశోధకుడు బాలరాజు కొడగానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. టూట్స్ ట్రాఫికింగ్ అప్లైయిడ్ టూ స్టాపింగ్ రూల్ ప్రాబ్లెమ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బాలరాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో బాలరాజు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆక్రమణలను కూల్చివేయాలి

కాశిబుగ్గ: నగరంలోని నాలాలపై ఆక్రమణలను కూల్చివేయాలని చిన్నవడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నగరంలో నాలాలు కబ్జాకు గురవుతున్నాయని అన్నారు. దాంతో వర్షాకాలంలో వరద నీరు ఎటువెళ్లక రోడ్లపైకి చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సొసైటీ సభ్యులు పోతన వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, హరినారాయణ, నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి సన్మానం

మడికొండ: మడికొండలోని శ్రీసత్యసాయి గార్డెన్‌లో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈమేరకు ఆయనను బీజేపీ స్థానిక నాయకులు కలిసి సన్మానించారు. నాయకులు వెంకట్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిషన్, సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మహేందర్, శివ, కిరణ్, ధనుంజయ్, రాజేష్, పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలి

వరంగల్ చౌరస్తా: ఆర్థిక పరిస్థితులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ యోగిరెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంజీవరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రైల్వేస్టేషన్ ఎదుట అడ్డదిడ్డంగా రాంగ్‌పార్కింగ్‌లో ఆటోలను నిలపరాదని అన్నారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

బస్సెక్కాలంటే బురదలో దిగాల్సిందే

- అపరిశుభ్రంగా బస్టాండ్ పరిసరాలు
- కంపు కొడుతున్న టాయిలెట్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


ఆత్మకూరు బస్టాండ్


బస్టాండ్ ఆవరణలో బురద (ఫైల్)

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంగణం బురదమయంగా మారుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో బస్టాండ్ ఆవరణం దుర్వాసన వెదజల్లుతోంది. మండల కేంద్రం నుంచి నిత్యం హనుమకొండ, ములుగు జిల్లాలకు వందలాది మంది ప్రయాణికులు బస్సుల ద్వారా ప్రయాణిస్తుంటారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండులో పరిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. బస్టాండ్‌లో టాయ్‌లెట్లు ఉన్నప్పటికీ నిర్వహణలోపంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే బస్టాండులో తాగునీటి సదుపాయం కల్పించపోవడంతో దాహార్తిని తీర్చుకునేందుకు వాటర్‌బాటిళ్లు కొనుగోలు చేస్తున్నామని అంటున్నారు. బస్టాండులో బురద, నీరు నిలిచి ఉండడంతో దోమలు వ్యాప్తిచెంది దోమకాటుకు గురవుతున్నామని, అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్యంపై దృష్టి సారించడం లేదని మండిపడుతున్నారు. భారీ వర్షం కురిస్తే బస్టాండ్ ఆవరణలో కాలి నడక కూడా కష్టతరంగా మారుతోందని వాపోతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా బస్టాండు ఆవరణలో బురద లేకుండా చూడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

బస్టాండ్ ఆవరణ మొత్తం బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అలాగే బస్టాండ్‌లో మౌళిక వసతులు కల్పించాలి. మరుగుదొడ్లు ఉన్నా ఉపయోగం లేదు. కంపు కొడుతున్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించాలి.

– రేవూరి ప్రవీణ్‌రెడ్డి, ప్రయాణికుడు

ఘనంగా పోచమ్మ ఆలయ దర్వాజ ప్రతిష్ఠాపన


పూజలో పాల్గొన్న గ్రామస్తులు

దామెర : మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ పునర్నిమానంలో భాగంగా ఆదివారం నిర్వహించిన దర్వాజ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ చైర్మన్ తాటికొండ రాజేందర్ మట్లాడుతూ.. ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకురావాలని కోరారు. ఈనెల 19, 20, 21 మూడు రోజులపాటు పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్దెత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, ఉపసర్పంచ్ నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భిక్షపతి, గ్రామపెద్దలు రవికుమార్, లింగమూర్తి, కొమురయ్య, కుమార్, స్వప్నరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్ర పూజలు


గర్భాలయంలో కొలువైన లక్ష్మీనారసింహుడు


ప్రత్యేకాలంకరణలో స్తంభ నారసింహుడు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తైన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అదే విధంగా అర్చకులు సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. లక్ష్మీ–నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు మాస కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం వేదోక్తంగా జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ–రాణి, మాజీ సర్పంచ్ కంజర్ల రమేశ్, ప్రభాకర్, అలమేలు మంగ, డాక్టర్ నిఖిల్‌కుమార్, డాక్టర్ ప్రవీణ, సత్యనారాయణ, ఉమారాణి అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత పోరాటాలు చేసింది ఎర్రజెండానే..


నినాదాలు చేస్తున్న నాయకులు, తదితరులు

వరంగల్: పీడిత, తాడిత ప్రజానీకం ప్రయోజనాల కోసం మహోన్నత పోరాటాలను ఎర్రజెండాయే చేసిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అన్నారు. వరంగల్ 3వ డివిజన్ స్టాలిన్‌నగర్‌లో ఆదివారం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ 50వ పునర్ నిర్మాణ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆవిర్భావం నుంచి ప్రజల కోసం అనేక పోరాటాలు చేసినట్లు వివరించారు. ఎర్రజెండా రాజ్యం కోసం వేలాదిమంది ప్రాణత్యాగాలతో నిర్మించబడిన పార్టీ సీపీఐ (ఎంఎల్) అని అన్నారు. కార్యక్రమంలో స్టాలిన్‌నగర్ గౌరవాధ్యక్షుడు ఆర్.ప్రసంగి, జిల్లా నాయకులు జన్ను ప్రవీణ్, ఎస్కే పాషా, జనగాం నాగరాజు, ఏనుగంటి రాజలింగం, సిలువేరు సుస్మిత, పోలెపోయిన శ్రీనివాస్, కంది రవి, పట్టం మొగిలి, కుమార్, శంకరాచారి, సదయ్య, కందాల నీలమ్మ, సంపత్, మనీల, మాలతి, ఉమ, గడ్డం రమేష్, నరేందర్, వినయ్, గౌస్‌పాషా, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాన్యాస రుద్రాభిషేకం


సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మడికొండ: ఈనెల 5నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మెట్టు రామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే, సీతారామ చంద్ర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాణ శర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రూ.3.50 కోట్లతో చెరువు అభివృద్ధి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: రూ.3.50 కోట్ల వ్యయంతో గోపాలపురం చెరువును అభివృద్ధి చేయనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. చెరువును ఎమ్మెల్యే ఆదివారం సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. వ్యర్థాలతో చెరువులోని నీరు కలుషితం అవుతోందని, దుర్వాసన వస్తోందని తెలిపారు. చెరువు శిఖం కబ్జాకు గురైందని, హైకోర్టు, లోకాయుక్తాలో కేసు నడుస్తోందని ఎమ్మెల్యేకు వివరించారు. చెరువులోని కొంత ప్రాంతాన్ని శ్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక అధ్యక్షుడు తుపాకుల దశరథం, కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మణీందర్ నాథ్, కందుకూరి పూర్ణచందర్, అశోక్, రాజేంద్రప్రసాద్, అనిత పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

ఖిలా వరంగల్: స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. వరంగల్ ఉర్సుగుట్టలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కాస్మోటిక్ చార్జీలు పేరుకే తప్ప విద్యార్థులకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం గురుకులాలపై కపట ప్రేమ చూపుతోందని ధ్వజమెత్తారు. మెనూ పాటించడం లేదని, పౌష్టికాహారం అందించడం లేదని వాపోయారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం పరామర్శ

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన సారంపెల్లి అమరేందర్‌రెడ్డి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహనికి పూలమాల వేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రాంగోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, సలీం మాలిక్, రణధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ సాధకుడు మంద కృష్ణమాదిగ ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలుకడంతో పాటు నిర్వహించే విజయోత్సవ మహాప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ అంకిల్ల మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహాప్రదర్శనకు ప్రతీ ఇంటి నుంచి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాడేటి రాజు, నాయకులు రాజు, వర్షిత్, శనిగరపు రమేశ్, ఆనందం, సాంబయ్య, శంకర్ పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

నడికూడ : మండలంలోని నార్లాపూర్ గ్రామంలో గల చెరువుకట్ట నుంచి ఎస్సారెస్పీ కెనాల్ వరకు ఉన్న ముళ్లపొదలను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నాయకులు జేసీబీతో తొలగించారు. అనంతరం గుంతలను పూడ్చిచారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్న, ఓరుగంటి రాజయ్య, శనిగరపు రవీందర్, రాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆగని గుడుంబా విక్రయాలు

ఆత్మకూరు : మండలంలో గుడుంబా విక్రయాలు ఆగడం లేదు. విక్రయాలు యధావిధిగా కొనసాగుతున్నయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గుడుంబా విక్రయదారులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా గుడుంబా విక్రయాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో కొంత మంది పేకాడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం దామెర పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న భాయి కుమారస్వామి, శివకుమార్, చిన్న రాజయ్య, గండి సమ్మయ్య, భాయి అన్విత్‌రాజ్ నుంచి రూ.1,150 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని దామెర పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారికైన చట్టపరంగా శిక్ష తప్పదన్నారు.

ఉద్యమ కెరటం మొగిలయ్య గౌడ్

ఖిలా వరంగల్: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఉద్యమ కెరటం బత్తిని మొగిలయ్య గౌడ్ అని, ఖిలా వరంగల్ ప్రధాన రోడ్డుకు మొగిలయ్య నామకరణం చేయాలని బార్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ పడమరకోట అమరవీరుల స్తూపం వద్ద మోకు దెబ్బ మొగిలయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొగిలయ్య గౌడ్ 78వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌గౌడ్ మాట్లాడుతూ 1946లో స్వాతంత్ర్య పోరాటంలో ఆర్య సమాజ్, జాతీయ కాంగ్రెస్ పార్టీలో మొగిలయ్య గౌడ్ చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. రజాకార్ల పాలనలో జాతీయ జెండాను ఎత్తి తన జాతీయభావాన్ని చాటిన మహనీయడని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, తీగల శ్రీధర్‌గౌడ్, అనంతుల రమేష్, మడిపెల్లి రమేష్, ఉమ్మగాని గణేష్, పోశాల సురేష్, తడక శ్రీను, పోశాల రాజేష్, రవి, ఎల్లాగౌడ్, తిరుమలేష్ రాజు, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైనప్పుడే గుర్తింపు

- పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్


హోంగార్డు రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐలు, ఎస్సై

శాయంపేట : ప్రజలతో ఉద్యోగులు మమేకమై పనిచేసినప్పుడే ప్రజలు చిరస్థాయిలో గుర్తుంచుకుంటారని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన గొట్టిముక్కుల రమేశ్ సన్మాన సభ ఆదివారం ఎస్సై ప్రమోద్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఏసీపీ కిశోర్‌కుమార్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పదన్నారు. హోంగార్డుగా రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే వారికి మంచి గుర్తింపు వస్తోందని, పనిచేసిన చోట మంచి పేరు తెచ్చుకోవాలనే సంకల్పం ఉండాలని అన్నారు. అనంతరం రమేశ్ దపంతులను పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. అనంతరం శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన ఏఎస్సై శైలజ, హెడ్ కానిస్టేబుల్ స్వామినాయక్‌ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట, పరకాల సీఐలు రంజిత్‌రావు, క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించే తిరంగా ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహ శుద్ధీ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, పల్లెపాటి మధుకర్, ఆరేపల్లి వినోద్, పెరుగు మధు, రాజు, వెంకటేశ్, సంపత్, రమణ, శ్యామ్‌సింగ్, రగొత్తం రెడ్డి, బాబు పాల్గొన్నారు.

నీరుకుళ్లలో ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం పోచమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. తల్లి సల్లంగాచూడు అని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సలేంద్ర వినోద్, అన్నమాచారి, పానుగోటి శ్రీనివాస్, కోటి, సత్యం, దేవేంద్రాచారి, కోటిలింగాలచారి, పాల్గొన్నారు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు


పరకాలలోని సీఎస్ఐలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు 23 సంవత్సరాల తరువాత ఆదివారం విద్యార్థులు సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అసాన్‌అలీ, ప్రకాశం రాజమౌళి, స్వర్ణలత, రమేశ్, దాసరి రమేశ్, పూర్వ విద్యార్థులు మమత, శ్రీలత, స్రవంతి, రాధిక, సృజన, సుమలత, రమాదేవి, కల్యాణి, ప్రతాప్, చిరంజీవి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలోని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో 1992–1993 సంవత్సరంలో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 31 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో సంబురపడ్డారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కే.జే థామస్, ఉపాధ్యాయులు డి.కోర్నెల్, ఎం.నరసింహారామయ్య, జేమ్స్, ఉపాధ్యాయేతర సిబ్బంది జాన్, పౌల్, ఐలన్న, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలపై నిలదీసినందుకే ఆరోపణలు


మాట్లాడుతున్న మంద సురేశ్

శాయంపేట : డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి అక్రమ దందాకు పాల్పడుతున్నాడని బహుజన స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుపతి చేసే అక్రమాలపై నిలదీసినందుకు తనపై కక్షతో ఆరోపణలు చేస్తున్నట్లు మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదల దగ్గర నుంచి డబ్బులు దండుకున్నాడని ఆరోపించారు. 10 సంవత్సరాల నుంచి పార్టీకి సేవలు చేసిన తనపై గుండ్ల సింగారం పరిధిలో ఒక ప్లాట్ కావాలని తిరుపతిని అడుగగా కొంత డబ్బు ఇస్తేనే జిల్లా కమిటీతో మాట్లాడి ఇప్పియ్యగలుగు తానని చెప్పాడని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలను నిలదీసి అడగడం వలనే తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఫండ్ కలెక్షన్ చేయమని చెప్పకముందే తన సొంత నిర్ణయాలతో అక్రమాలకు పాల్పడి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని అన్నారు. డీవైఎఫ్ఐ ఆర్గనైజన్ పేరుతో రూ. 50లక్షలు కలెక్షన్ చేసుకొని రాష్ట్ర కమిటీ దృష్టికి తెలియకుండా గుండ్ల సింగారంలో ప్లాట్ కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నాడని ఆరోపించారు. త్వరలో అన్ని అక్రమాలను బయటపెడుతామని అన్నారు. ఆయన వెంట రాజశేఖర్, సురేశ్, ప్రమోద్, నవీన్ ఉన్నారు.